# 24. టోపీదాసుల మహాసభలు

"నేటి పవిత్ర భారతంలోకెల్లా అత్యంత అభినందనీయులైన వారెవరంటే అతను మన సామాన్య పౌరుడు వినా మరెవరూ గాదు కరువు కాటకాలెన్ని వచ్చినా, పన్నుల బరువులెన్ని పడినా, తిన తిండి, కట్ట గుడ్డలేకున్నా అత్యంత సహసంతో వీటన్నిటినీ భరిస్తూ, సహిస్తూన్న మన సామాన్య పౌరులను అభినందించక తప్పదు.'

ఈ మధ్య ప్రధాని ఇందిరాజీయే ఓ సభలో వెల్లడించిన ప్రశంశా వాక్యాలివి.

ఈ కఠోర సత్యాన్ని లేదా బోడి నిజాన్ని రుజూ చేసేందుకు మన మేమంత కష్టపడ నవసరం లేదు. ఆ మహోపన్యాసం వెలువడిన దిన పత్రికలోనే అందుకు సాక్ష్యం అన దగిన మరో వార్తకూడా వెలువడింది. దాని సారాంశం ఏమంటే :

అనగా అనగా ఓ పల్లెటూరు. అక్కడి వారికి ముక్కు ఊడినా, మోకాలు చిట్లినా బాగుచేసేందుకు డాక్టరూలేడు, డాక్టరు ఉండేందుకు హాస్పటలూ లేదు. అయితే పట్నాల్లో మాత్రం ఘనమైన ఏలినవారి చుట్టపక్కాల్లో డాక్టరీ చదివి నిరుద్యోగులుగా పేకాడుకుంటూ కాలక్షేపం చేస్తున్న వారు

న్నారు. వాళ్ళలా మెడిసిన్‌లోనూ సర్జరీలోనూ గాకుండా చతుర్ముఖ పారాయణంలో స్పెషలిస్టులుగా తయారవటం చూసి సహించలేని ఏలినవారు మరికొన్ని పల్లెలతోపాటు ఈ పల్లెటూరికిన్నీ కూడా ఓ ఆస్పటల్ని, దాన్ని కాపలా కాసేందుకు తమ బందుగుల్లోని ఓ డాక్టర్ కుర్రాణ్ణీ శాంక్షన్ చేసేశారు.

(ఈ మహత్తర విషయాన్ని మన పత్రికా రాజాలన్నీ ప్రముఖంగా ప్రకటించి దేశ పురోభివృద్ధిని గురించిన మన అల్ప పరిజ్ఞానాన్ని అనల్పం చేసిన విషయంకూడా మనకు విదితమే).

అలా ఆ పల్లెకు దొరికిన ఆస్పటల్‌కు ఓ అద్దెకొంప ఉంది. అందులో ఓ డాక్టరున్నాడు కనుక రోగులూ వచ్చేవారు. కానీ, వారికిచ్చేందుకు ఇంజెక్షన్లూ లేవు, మందులూ లేవు. అవి దగ్గర్లో గల పట్నంలోని అందమైన మందుల దుకాణాల అద్దాల బీర్వాల్లో భద్రంగా వున్నాయి. అందువల్ల మన నవ యువ డాక్టర్ రోగు లెల్లరికి తలో కాసిన్ని సలహాలు ఇచ్చి, తర్వాత వారు కొని, తినవలసి ఉన్న మందుల్ని రాసిచ్చేవాడు.

ఆ విధంగా గరిబీ హటావో స్కీము క్రింద ఓ యువ డాక్టరు గరీబీని అటావో చేసేసిన సదరు హాస్పిటల్‌కు ఓ సుదినాన ఓ అసలు సిసలు నిరాక్షరాస్య గరీబీ వేంచేశాడు. వాడి రోగాన్ని ఇట్టే కనిపెట్టేసిన మన నవ యువ డాక్టర్

తళ తళలాడే మందుల దుకాణం వారి తెల్లకాగితం మీద ఓ మందు పేరు రాసిచ్చేడు, "ఒరే, గరీబీ! మా పాలిటి కల్ప వృక్షుడా! మా పెద్దలకు ఓట్లిచ్చి, వారి ద్వారా మాకు ఉద్యోగాలిప్పిస్తున్న దివ్య పురుషుడా, ఇదిగో ఈ మందును రోజుకు రెండుసార్లు చొప్పున ఎనిమిది రోజులూ కన్నీళ్ళు కలపకుండా మ్రింగు. నీ రోగం జోకర్ను చూసిన ఇస్పేటు రాణీలా పారి పోతుంది గాక!" అని అభయంకూడా ఇచ్చేడు.

సరిగ్గా తొమ్మిదో రోజున సదరు గరిబీ మరలా వేంచేశాడు. "డాక్టర్ సాబ్, తమరిచ్చిన మందు మా కామందు గారి చింత బరికె కన్నా అమోఘంగా పని చేసిందండీ. నా జబ్బు ఈ వారం రోజుల్లోనూ ఎగిరిపోయిందండి కానీ, సామీ రోజూ తిండి ఉండటం లేదు. పొలంలో పనిచేసే ఓపికా రావటం లేదు. దానికూ్కడా ఏదన్నా మందిప్పించండి సామీ' అని వేడుకున్నాట్ట.

మన నవ యువ డాక్టర్ అందుకు చాలా సంతోషించాడు. ఇన్నాళ్ళూ పేకాటలో పడి మందుల పేర్లు మరచి పోనందుకు తనభుజం తనే చరుచుకున్నాడు. "సరే. ఏదీ, నేను మందు రాసిచ్చిన కాగితం," అనడిగేడు ఆమందునే కంటిన్యూ చేద్దామని.

సదరు గరీబీ తెల్ల మోహం వేసేశాడు. "ఆ కాగితం ఎలా వస్తది బాబూ, తమరు శెలవిచ్చిన ప్రకారం ఆ కాయి

తాన్ని పదారు ముక్కలు చేసి ఈ వారం రోజులూ రోజుకు రెండు ముక్కలు చొప్పున తింటిని గదా" అనడిగేడుట.

ఆ తరువాత కథ ఆ పత్రికలో రాలేదు, మనకు అనవసరం కూడా. కానీ, మన సామాన్యుడు ఎంత సహనశీలియో ఈ ఉదంతం మనకు తెలియ చెప్పటం లేదా. కనీసం గాలి-నీళ్లు కూడా కాదు; కేవలం కాగితం ముక్కల్నే మందుగా సేవించి బాగుపడిపోగల సహనశీలత ఈ విశ్వంలో ఇంకెవరి కన్నా ఉన్నదా?

ఇందిరాజీయే మరో కఠోర సత్యాన్ని కూడా మన గరీబీలకు మొన్ననే గుర్తుచేశారు. ఏమని? "ఆర్థికంగా వచ్చే రెండు నెలలూ మరింత గడ్డుగా వుంటాయి." అని.

అలా గడ్డురోజులు రానున్నాయని ఏలినవారు గుర్తించారంటేనే దానర్థం వాటిని ఎదుర్కొని పోరాడేందుకు కూడా సిద్ధమవుతున్నారనే. మనల్నేలే టోపీదాసుల సంఘం వారు ఇందులో అనుభవజ్ఞులు. వారి యుద్ధపాటవాన్ని మన మహాకవి గురజాడ అప్పారావు అరవయ్యేయిదేళ్ళ నాడే గుర్తించి కీర్తించేరు. ఆ నాడు మద్రాసులో జరిగిన కాంగ్రెసు మహాసభల తీరు తెన్నుల్ని తిలకించి ముగ్ధుడైన మహాకవి ప్రేమతో కొన్ని సర్టిఫికేట్లను కవితాత్మకంగా కాంగ్రెసు వారికి రాసిచ్చేరు.

''కాంగ్రెసు యుద్ధం-రూల్స్ ప్రకారం కాగితాలతో

నామకార్థం" అని అయన రాసింది హేళన చేసేందుకు గాదు. భవిష్యత్తులో గరీబీల రోగాల్ని కాగితం ముక్కల్తో కాంగ్రెసువారు వదల గొట్ట గలరని ఊహించబట్టే. ఎంతైనా మహాకవి గదా! మహాకవులకు దివ్య దృష్టి వుంటుంది గదండీ!

'పాడకోయ్ ఓ కవీ! కాంగ్రెసు ఒక భజన సమాజం మాత్రమే అనీ!' కూడా మహాకవిగారు హెచ్చరించేరు, నిజమే. మార్పు కనబడుతూనే ఉంది కదండీ. పూర్వం అయితే ప్రణాళికల్ని గురించీ కట్టబోయే ప్రాజెక్టుల్ని గురించీ వారు అదే పనిగా భజన చేసేవారు. వాటిలో కొన్ని చతికిల బడ్డాక, మరికొన్ని ముక్కుతూ, మూలుగుతూ లేస్తున్న తరుణంలోనయినా రానున్న గడ్డు రోజుల్ని గుర్తిస్తున్నారు గదా! అంతవరకూ నయినా వారు మెలుకువగా ఉన్నట్లే గదా!

కనుక, ప్రతినిధులంతా నిద్ర పోయినా భవనం క్రిక్కిరిసిన సత్రమే సుమీ! అన్న మహాకవి మాటలు కూడా ఆలోచించ దగ్గవే. అందరూ కాదు, కొందరే నిద్రబోతుండ వచ్చు మిగిలినవారు "అడపా దడపా అంతఃకలహం! అయితే బిల్ కుల్ అహింసాత్మకం" అన్న కవితా పాదాల్ని గుర్తు చేసుకుని ఆంధ్రోద్యమం లాంటి అంతఃకలహాల్ని రెచ్చగొట్టి, తీరా జనం తమ టోపీల్ని పాతిపెట్టమనేసరికి తెలివిగా అహింసా వేదాలు వల్లించి సదరు సామాన్యులకే టోపీలు వేసి అడ్రసు దొరకకుండా మాయం కావొచ్చు.

కనుక మన టోపీదాసుల సంఘం ఓ మయ సభ లాంటిది. సామాన్యు డందులో అడుగెడితే తివాచీ అనుకుని ఏ మురిగ్గుంటలోనో మునిగి పోగలడు. ఆ భ్రమలు సృష్టించటంలో ఏలిన వారు అపర బ్రహ్మలు. "మితవాదులు నేర్పె గుణపాఠం, ఏ యే యెండల కాయా గొడుగులు" అని మహాకవిగారే శెలవిచ్చారు. ఒక్కో ఎలక్షన్ టైముకూ వారు ఏ చైనా గొడుగో, ఏ పాకిస్తాన్ గొడుగో సంపాదిస్తూనే వున్నారు. టోపీల్నీ, వాటిలోని తురాయిల్నీ కాపాడుకుంటూనే ఉన్నారు. సామాన్యుడిని జోకొట్టగలుతూనే ఉన్నారు. అతని సహనశీలతను అమోఘంగా పెంచగలుగుతూనే ఉన్నారు.

"మరయితే ప్రతిపక్షాల వారేం చేస్తున్నారు?" అని కొందరు అమాయకు లడగవచ్చు. అది కూడా మహాకవిగారే శెలవిచ్చేరు.

'కాదని బరిదిగి తిరగబడేవో ద్వీపాంతరమే! లేదిక తిరుగుడు కావున జోరుగ కంఠ శోషగా ఉపన్యసిస్తూ నుంచుందాం! అస్తమానమూ లాభం చూడక, రాజభక్తితో పొంచుందాం!" మహాకవి వాక్కుల్ని అక్షరాలా పాటిస్తున్నారు టోపీ దాసులకు వ్యతిరేకంగా మనకోసం కంకణం కట్టుకున్న నాన్ టోపీ దాసులు.

మరి సామాన్యుడి గతేమిటంటారా? ఆ సంగతి మన

మైన ఏలినవారే చూసుకోగలరు? ముందున్నది ముసళ్ళ పండుగ. అని వారే శెలవిచ్చారు గదా. ఆ పండగ వచ్చాక మనవాడిని జోకొట్టేటందుకు కాగితం ముక్కలుకూడా దొరకవు. ఆ రహస్యం గ్రహించిననాడతడ సామాన్యుడవుతాడు. ఆనాడు మనకే పాఠాలు నేర్పగలడు.

(సెప్టెంబర్ 1973)